# పరమార్థం

"అంకుల్ !" అంటూ గేటు అవతలనుండి ఒక పసివాడి కంఠం వినిపించింది.

తీవ్రమైన నిరాశ నిస్పృహలలో కూరుకుపోయి, మానసికంగా కృంగిపోయిన స్థితిలో కుర్చీలో వాలి కళ్ళు మూసుకుని ఉన్న సూర్యారావు ఆ గొంతు విని ఉలిక్కిపడి కళ్ళు తెరిచి గేటు వైపు దృష్టి సారించాడు.

"అంకుల్! అనాథ శరణాలయానికి డొనేషన్లు సేకరిస్తున్నాము." మెడలో స్కూలుకు సంబంధించిన గుర్తింపు కార్డు వ్రేలాడుతున్న పదేళ్ళ అబ్బాయి సూర్యారావు వైపు చూస్తూ అన్నాడు.

"ఎవర్రా నీకు అంకుల్? ప్రతి అడ్డమైన వాడికీ మేము మామలం, అత్తలం అయిపోతున్నాం! సార్ అని పిలవలేవూ?" ఉగ్రంగా చూస్తూ అరిచాడు.

ఆ అబ్బాయి ఒక్క అడుగు వెనక్కి వేసాడు బెదిరిపోయి.

"అనాథ శరణాలయాలకు విరాళమంటూ పనిలేని వాళ్ళంతా బయల్దేరతారు. తేరగా డబ్బులు దొరుకుతాయి కదా! పో.. పో... చాలా ఇచ్చాంలే ఇలాటివి!" విసుగ్గా కసిరాడు.

ఈ అవమానంతో ఆ కుర్రాడి ముఖం కందిపోయింది. పూడుకుపోతున్న గొంతు పెగల్చుకుని "ఇది మా కోసం కాదు సార్! మా స్కూల్‌వాళ్ళు అనాథ శరణాలయం నడుపుతున్నారు. వాళ్ళకోసం విరాళాలు సేకరించమని మమ్మల్ని పంపారు." అన్నాడు హీనస్వరంతో.

"శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు. ఏదో ఒక పేరు చెప్పి డబ్బు లాగుతారు గానీ వెళ్ళు!" అన్నాడు సూర్యారావు కఠినంగా.

ఇంతలో లోపలి నుండి గబగబా వచ్చింది భార్య ఛాయామణి.

"ఎందుకండీ పసివాడిని అలా బెదరగొడతారు? చిన్న పిల్లలు పాపం! ఎవరికోసమో ఎండనబడి తిరిగి సహాయం చేయాలని చూస్తుంటే వాళ్ళేదో మాయ చేసి దేశాన్నే దోచుకు తింటున్నట్టు చీదరించుకుంటున్నారు.

ఒక పది రూపాయలిచ్చి పంపితే మీ ఆస్తి కరిగిపోతుందా?" అంటూ వెళ్ళి – ఆ పసివాడు తెచ్చిన హుండీలో డబ్బులు వేసి, వాడు అందించిన పుస్తకంలో పేరు, అడ్రస్ రాసి సంతకం పెట్టి రసీదు తీసుకుని ఆ రసీదు మొగుడి ఒళ్ళో పడేలా విసిరి

"అందులో ఆ అనాథ శరణాలయం పేరు, అడ్రస్, రిజిస్టర్డ్ నెంబరు అన్నీ ఉన్నాయి చూసుకోండి. ఆ డబ్బు ఎవరూ మింగేయరు!" అనేసి వంటింట్లోకి పోయింది.

సూర్యారావుకు అలవిమాలిన కోపం ముంచుకొచ్చింది. చటుక్కున లేచి ఆవిడ వెనకే వెళ్తూ – "అవును... నువ్వు వెళ్ళి చూసి వచ్చావు ఆ శరణాలయం! దొంగ రసీదులు, దొంగ పేర్లతో డబ్బు దండుకునేవాళ్ళను ప్రోత్సహించడం వలన పుణ్యం కాదు, పాపం వస్తుంది!" అంటూ అరిచాడు.

చిన్న విషయానికి అంత ఆవేశపడిపోతున్న భర్త వంక ఆశ్చర్యంగా చూసింది ఛాయామణి.

"మీరు పాదపూజలు, స్వామి సేవలు అంటూ ఖర్చు పెట్టే దాంట్లో ఇదెంత శాతమండీ!" అంది అనునయంగా.

దాంతో మరీ రెచ్చిపోయాడు సూర్యారావు. "నువ్వా నన్ను దెప్పిపొడిచేదానివే అయ్యావన్నమాట! అవునే... నా సంపాదన నా ఇష్టం! బాబాలకే ముడుపులు చెల్లిస్తానో, స్వాములకే సమర్పిస్తానో.... నువ్వెవరివి అడగడానికి?" చేతికి అందుబాటులో ఉన్న స్టీలు గ్లాసు తీసి నేలకేసి కొట్టాడు.

ఛాయామణికి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"అవున్లెండి! నేనేమన్నా సంపాదిస్తున్నానా? ఇంట్లో వెట్టి చాకిరీ చేస్తున్నదాన్ని. మీ డబ్బు మీ అనుమతి లేకుండా ఇవ్వడం తప్పే!" రోషంతో అంటూ – మాడిపోవడానికి సిద్ధంగా ఉన్న పోపులోకి కూరముక్కలు విసురుగా వేసింది.

"మీరు స్నానం చేసి వస్తే అన్నం పెడతాను!" అంటూ అటు తిరిగింది.

"నేను ఆఫీసుకు పోకపోతే నీకు ఇబ్బందిగా ఉంటుందంటే ఏదైనా పార్కుకి పోయి చెట్టుక్రింద కూర్చుంటాను!" అంటూ చెప్పులు తొడుక్కుని వీధిలోకి నడిచాడు సూర్యారావు.

ఛాయామణి ఏదో సర్దిచెప్పాలనుకునేంతలో అతను పెద్ద పెద్ద అంగలు వేస్తూ వీధి మలుపు తిరిగేసాడు.

సెలవు రోజుల్లోనూ, సాయంకాలం పూట పిల్లల అల్లరితో తుళ్ళిపడే పార్కు ఖాళీగా, బోసిగా బావురుమంటోంది. అక్కడక్కడా ఒకరిద్దరు ముసలివాళ్ళు కూర్చుని ఉన్నారు. చెట్టునీడన ఉన్న సిమెంటు బెంచిమీద పడుకుని కళ్ళు మూసుకున్నాడు సూర్యారావు.

ఆఫీసులో తోటి ఉద్యోగుల నుండి హేళన నిండిన మాటలు, జాలిచూపులు ఎదుర్కోవలసి వస్తుందని ఆఫీసుకు వెళ్ళడం ఇష్టం లేక ఇంట్లో ఉంటే – ఇక్కడా తప్పలేదు.

ఎంత చవటైనా ఒకసారి మోసపోతాడు, రెండుసార్లు టోపీ పెట్టించుకుంటాడేమో గానీ – తనలాగా పదే పదే శఠగోపం పెట్టించుకోడు.

అయినా అదేం ఖర్మమో! తను ఎంతో నమ్మకంతో, విశ్వాసంతో, దైవచింతనతో గురువుల అనుగ్రహం కోసం ప్రాకులాడుతుంటే ఇన్ని ఎదురుదెబ్బలు తనకే తగులుతున్నా యెందుకో! ఒక పాప భీతిగానీ, ఆధ్యాత్మిక చింతన గానీ లేకుండా పైలాపచ్చీసుగా బ్రతుకుతున్న తన పక్కసీటు మోహనరావుకి అన్నీ కలిసొస్తుంటాయి చిత్రంగా. ఎంత సేపూ పిల్లలు, సంసారం అనే ఝంఝాటంలో కొట్టుకుపోకుండా, కాస్త ముక్తిమార్గం కూడా చూసుకుందామనుకునే తనకేమో నెత్తి బొప్పికట్టేట్టు ఎదురు దెబ్బలు.

ఒక్కొక్క అనుభవం తలచుకుంటుంటే అతనికి జీవితం మీదే విరక్తి పుడుతోంది. ప్రపంచం మీద కసి పెరుగుతోంది.

వెన్ను నిమిరినట్టు ఎంతో ఆత్మీయంగా ఉండే ఆయన శిష్యుల మాటలు తనమీద మంత్రం లాగా పని చేయడంతో, భగవంతుని అవతారంగా చెప్పుకుంటున్న శ్రీవారి వద్ద దీక్ష తీసుకోవాలని ముప్పైవేలు కట్టి వెళ్ళాడు. అక్కడ ఇంకా ముఖ్యమైన శిష్యులు తనతో ఉపవాసాలు చేయించి, ప్రసాదాలు పెట్టి, తలమీద చేయి వేసి శక్తిప్రవాహం తనలో ప్రవేశ పెట్టినప్పుడు అలౌకికమైన అనుభూతిని పొందాడు. శరీరం తేలికైపోయి గాలిలో తేలిపోతున్నట్టు ఏదో తెలియని ఆనందంతో మనసు సోలిపోయి ఎదురుగా ఎవరుంటే వారిని ప్రేమగా హత్తుకోవాలనిపించే మహామాయలో, మధురాను భూతిలో కొద్దిరోజులు గడిపాడు.

ఉద్యోగం వదులుకోలేక అయిష్టంగానే ఇంటికి తిరిగివచ్చాడు.

వచ్చిన నాలుగు రోజుల్లోనే టి.వి.లో వచ్చిన వార్తలు చూసి మనసు ముక్కలైపోయింది. భగవంతుడని జనమంతా సాగిలపడిన శ్రీవారు ఎన్ని అనైతిక మార్గాలలో ధనం మూటకట్టుకున్నారో, భక్తులను మత్తులో ముంచి మాయ చేసారో వివరంగా చూపిస్తుంటే సిగ్గుతో చితికిపోయాడు.

మరొకసారి ఇలా మోసపోకూడదని చెంపలు వాయించుకున్నాడు.

ఆర్నెల్ల తరువాత అన్నీ మరచిపోయాడు. కాళిదాసుగార్ని చూస్తే అపరశంకరుడినే చూసినట్టు ఉందనీ, ఆయన ముఖవర్చస్సు, శరీరకాంతి, వాగ్ధాటి సామాన్యులకు అలభ్యమనీ విని దాసుగార్ని శరణుజొచ్చాడు.

వారు కట్టించబోయే ఆశ్రమానికి విరాళం ఇవ్వడానికి పి.ఎఫ్ మీద ఋణం తీసుకుని ఇరవై వేలు సమర్పించుకున్నాడు. తనకు గృహస్థాశ్రమం మీద వైరాగ్యం కలిగినపుడు దాసుగారి ఆశ్రమంలో సేద తీరడానికి చోటు ఉంటుందని పొంగిపోయాడు. ఆ దాసుగారు ఊరూరా తిరిగి ఆధ్యాత్మిక ప్రబోధాలు చేస్తుంటే సెలవు పెట్టి మరీ వెళ్ళి విని తరించారు. అంతలోనే కాళిదాసుగారు ఒకానొక ఊళ్ళో కాంతాదాసుడిగా మారి ప్రేమలో పడి తరించి ముక్తిని రక్తిని అభేద్యంగా చూపడంతో విద్యుద్ఘాతం తిన్నవాడిలా డీలా పడిపోయాడు.

ఆ షాకు ఘుండి తేరుకోవడానికి ఆరునెలలు పట్టింది. దెబ్బమీద దెబ్బ తగలడంతో చిరాకులు, ఛీత్కారాలు దైనందిన జీవితాన్ని కుదిపేసాయి. కానీ తన కోపతాపాలు తట్టుకుంటూ, ఇంటిపని చేసుకుంటూ, పిల్లలతో సతమతమయ్యే తన ఇల్లాలి మనసు మాటా కూడా ఎప్పటిలాగే మృదువుగానే ఉన్నాయి.

ఒక గురువు, దీక్ష, మంత్రము, ధ్యానము అన్న ధ్యాస లేకుండా గడిపేసే అజ్ఞానురాలు ఆమె అనుకుని జాలిపడ్డాడు.

ఎక్కడెక్కడికో వెళ్ళి గురవుల దర్శనార్థం పడిగాపులు పడే శ్రమ లేకుండా కొన్నాళ్ళ క్రిందట ఈ ఊళ్ళోనే ఆశ్రమం ఏర్పాటు చేసుకున్నారు. నిత్యసంతోషులు, పరమాత్మ స్వరూపులు అయిన స్వామివారు. పాతికవేలు కడితే నడిచి వచ్చే నారాయణమూర్తిలా తన ఇంటిని పావనం చేసి పాదపూజ చేయించుకుంటారని విని ఇంటిమీద అప్పు తీసుకుని వారిని ఆహ్వానించాడు.

ఆయన పాదస్పర్శ సోకి తన గృహం పావనం కాకమునుపే ఒకనాడు పొద్దున్నే టి.వి.లన్నీ గొల్లుమంటూ స్వామివారు భక్తవాత్సల్యంతో అందగత్తెలతో 'సేవ' చేయించుకుంటున్న దృశ్యాలు పదే పదే చూపించాయి.

అదిగో అప్పుడే సూర్యారావుకు ప్రపంచంమీద కసి పెరిగింది. జీవితం మీద విరక్తి పుట్టింది.

ఎండ పొడ మీద పడుతుండటంతో పార్కులోని సిమెంటు బెంచిమీద నుండి లేచి ఇంటిదారి పట్టాడు సూర్యారావు. ఇంట్లోకి అడుగు పెడుతుండగానే టి.వి. వైపు చూపించింది ఛాయామణి.

నిత్యసంతోష స్వామివారి పాదపూజ కోసం డబ్బు కట్టినవారు రసీదు తీసుకువచ్చి చూపిస్తే డబ్బు తిరిగి ఇప్పిస్తామంటూ పోలీసు శాఖ ప్రకటన చేసింది. ఎండనబడి నడచి వచ్చిన వాడల్లా - నీళ్లైనా త్రాగకుండా రసీదు చేత బుచ్చుకుని స్కూటరెక్కాడు సూర్యారావు.

ఆ వెళ్ళినవాడు రాత్రి పది గంటలకు గానీ తిరిగి రాలేదు. ఏమైందో ఏమోనని బెంగ పెట్టుకుని, తిండి లేక నీరసపడి వీధిగుమ్మంలో కూర్చుని పడిగాపులు పడుతున్న ఛాయామణికి నవ్వు ముఖంతో గేటు తీస్తున్న మొగుడిని చూసి ప్రాణం లేచి వచ్చింది. స్నానం చేసి వచ్చాక వేడివేడిగా అన్నం వడ్డించింది. కడుపునిండా తిని పది నిముషాలలో ప్రశాంతంగా నిద్రపోయాడు సూర్యారావు.

మరునాడు అతను ఆఫీసుకు బయల్దేరుతుంటే ఒక ఆహ్వానపత్రిక అందించింది ఛాయామణి.

అది ఒక అనాథ శరణాలయం వార్షికోత్సవ వేడుక ఆహ్వానపత్రిక. ఆ రోజు సాయంత్రమే జరుగుబోతున్నది.

"ఆ పిల్లాడు అప్పుడు ఇవ్వడం మరచి పోయాడట! మళ్ళీ వచ్చి ఇచ్చి వెళ్ళాడు." అందామె నేలవైపు చూస్తూ.

"సాయంత్రం సిద్ధంగా ఉండు. పిల్లల్ని తీసుకుని వెళదాం!" అనేసి ఆఫీసుకు వెళ్ళాడు సూర్యారావు.

ఛాయామణి ఆశ్చర్యపోయింది! ఏదో మాట వరసకు అన్నాడు అనుకుంది గానీ సాయంకాలం తొందరగా ఇల్లు చేరిన మొగుడిని చూసాక గబగబా తయారయ్యింది.

తీరా అక్కడికి వెళ్ళాక తెలిసింది వారికి. అది మామూలు శరణాలయం కాదనీ, పుట్టుకతో వచ్చిన అంగవైకల్యం, బుద్ధిమాంద్యం ఉన్న పిల్లల కోసం నడుపుతున్న ప్రత్యేకమైన హోమ్ అని.

చేతులు లేనివారు కాళ్ళతో వేసిన పెయింటింగ్స్, కళ్ళు లేని వారు ఎంతో నేర్పుతో అల్లిన సంచులు, కళాత్మకమైన బుట్టలు, పదిహేనేళ్ళ పిల్లలైనా పదేళ్ళ వాళ్ళలా ప్రవర్తించే పిల్లలతో వేయించిన నాటికనూ చూసి అక్కడకు వచ్చిన వారంతా అబ్బురపడ్డారు.

ఆ శరణాలయాన్ని ప్రారంభించిన దత్తుగారు అందరికన్నా చివరన మాట్లాడారు. ఆయనకు ముగ్గురు పిల్లలు. రెండవ అబ్బాయి, మూడవ అమ్మాయి మంచి చదువులు చదివి ఉన్నత ఉద్యోగాలలో ఉన్నారు.

పెద్ద కొడుకు ఎప్పటికీ బుద్ధి వికసించని పసివాడే అని తెలిసినప్పుడు ఆయన పడిన వేదన గురించి చెబుతుంటే - వింటున్న వారి హృదయాలు ద్రవించాయి.

ఆ వేదన నుండే అటువంటి పిల్లల కోసం ఏదైనా చేయాలన్న సంకల్పం కలగడం, తనకున్న కొద్ది వనరులతో ఈ శరణాలయం స్థాపించడం, సాటి మనుషులను ఆదుకునే సౌజన్య మూర్తుల సహాయంతో ముఖ్యంగా ఒక స్కూలు యాజమాన్యం సహాయ సహకారాలతో ఆశ్రమ నిర్వహణ జరుపుతున్నట్టు వివరించి, ఇకముందు కూడా వారి చేయూతను కోరుతూ ఉపన్యాసం ముగించారు దత్తుగారు.

తన బాధను లోకానికి పంచడం కాక, లోకం బాధను తన పరిధిలో కొంతవరకు తీర్చడానికి పూనుకున్న ఆ 'మనీషి' కి అందరూ కరతాళ ధ్వనులతో అభినందనలు తెలిపారు.

తాను ఇన్నాళ్ళుగా ఆధ్యాత్మిక మార్గమంటూ తిరిగిన ఆశ్రమాలు, ఇందులోని స్వాముల పల్లకీ సేవలు, పాదపూజలు, ఆడంబరాలు, అట్టహాసాలు ఇవేవీ మచ్చుకైనా లేని ఈ ఆశ్రమం ఒక ఆలయంగా కనిపించింది సూర్యారావుకు.

దేవుడు చీకటిగా ఉండే గర్భగుడిలో కాదు, వీధిలో ఎండలో రాళ్ళు కొట్టేవారి శ్రమలో ఉన్నాడన్న రవీంద్రుని వాక్యాలు గుర్తుకొచ్చాయి.

సర్వజీవులయందు తానే దాగి ఉన్నాడన్న పరమాత్మ పలుకుల పరమార్థం అతనికి గోచరించింది. "వాసనా ద్వాసు దేవస్య వాసితంతే భువన (జగత్త్రయం) త్రయం సర్వభూత నివాసోHసి వాసుదేవ నమోస్తుతే" అన్న వ్యాస భగవానుని పలుకులు మనసులో మెదిలాయి.

తన దారినుండి ప్రక్కకు తొలగమని పలికిన శంకరాచార్యుని "నువ్వు ఎవరిని తొలగి పొమ్మంటున్నావు? శరీరాన్నా? ఆత్మనా?" అని ప్రశ్నించి హెచ్చరించిన ఛండాలుడి రూపంలోని పరమేశ్వరుని మేలుకొలుపు గుర్తుకు వచ్చింది.

ముందు రోజు పోలీసు వారు తనకు తిరిగి ఇప్పించిన పాదపూజ తాలూకు పాతిక వేల రూపాయల చెక్కుని చేత బట్టుకుని వేదిక నెక్కాడు సూర్యారావు.

ప్రసన్నంగా చూస్తున్న ఛాయామణి వదనంలో మందహాసం పల్లవించింది.

- చిత్ర మాసపత్రిక ఫిబ్రవరి 2011